# పరం

"కూర్చోండి" అన్నాను.

శేషగిరి బల్లకు దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. అతని ముఖం కోపంతో గూడుకట్టుకుని ఉంది. అతని భార్య సుజాత కూర్చోడానికి తటపటాయిస్తోంటే, "కూర్చోమ్మా" అన్నాను, నా చేయి కుర్చీ వయిపు చూపిస్తూ.

అతని పక్కనే ఉన్న కుర్చీ వదిలి దాని పక్కన ఉన్న కుర్చీలో కూర్చుంది. తల దువ్వుకోలేదు. జుట్టు చిందర వందరగా ఉంది. ఉంగరాల జుట్టు చివర రబ్బరు బేండ్ పెట్టుకున్నట్టుంది. ఎర్రటి ముఖం కందిపోయి ఉంది. వాచినట్టుగానూ ఉంది. మా ఇంటికి వచ్చే ముందు ఏడ్చినట్టు ఉందనుకుంటాను, కళ్లు ఎర్రగా ఉన్నాయి.

ఆ భార్యా భర్తలు నాకు గత ఆరేడు సంవత్సరాలుగా తెలుసు. అతనికి ముప్పయి సంవత్సరాలుంటాయి. ఆమెకు ఇరవయి అయిదు సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండవు. చూడడానికి ఇంకా చిన్న వయసురాలిగా కనిపిస్తుంటుంది. మునుపటి కన్నా మనిషి కాస్త నునుపు తేలింది. అతను మా కంపెనీ కేంటిన్‌లో వర్కరుగా పని చేస్తున్నాడు. వంటలు రుచిగా చేయడంలో అతనికి తిరుగు లేదు. మా ఇంటిలో ఏ పండగయినా, పబ్బానికయినా అతన్నే పిలుస్తుంటాను. లోగడ మా టౌన్‌షిప్ దగ్గర్లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవారు. గత మూడు సంవత్సరాల నుండి వాళ్ల ఆఫీసరు ఇంట్లో సబ్‌లెట్‌కు ఉంటున్నానని తనే ఆ మధ్య ఒకసారి చెప్పాడు. వాళ్లకు అయిదు సంవత్సరాల కొడుకు. స్కూల్లో చేర్పించారనుకుంటాను.

"టీ తాగుతారా, కాఫీ తాగుతారా?" అడిగాను.

"ఏం వద్దండీ" అన్నాడు. మాటలో బాధ ఉన్నట్టు అనిపించింది. ఏవీ తీసుకునే మూడ్‌లో ఉన్నట్టు లేదు.

సుజాత వంక చూశాను. తనకు ఏమీ వద్దన్నట్టు తల అడ్డంగా ఆడించింది.

చూసుకుందో, లేదో చెవికి ఒక దుద్దే ఉంది. రెండోది పోయిందో, పెట్టుకోవడం మర్చిపోయిందో?

"నీకు ఒక దుద్దే ఉంది" అన్నాను.

తడుముకుని, "ఇంట్లో పడిపోయి ఉండాలి" అని రెండోది తీసి కుడి అరచేతిలో పెట్టుకుంది. రెండు అరచేతులు గోరింటాకుతో పండి ఉన్నాయి. చేతిగోళ్లకు ఎర్రటి పాలిష్ ఉదయం వేసుకున్నట్టుగా ఉంది.

అంతలో మా పనిమనిషి ట్రేలో మూడు గ్లాసుల మంచినీళ్లు, మూడు కప్పుల్లో టీ తీసుకువచ్చి బల్లమీద మా ముందుంచి ఖాళీ ట్రే తీసుకు వెళ్లి పోయింది. సాయంత్రం ఆరయి ఉంటుంది. ఎండాకాలం కాకపోయినా గది వేడిగా ఉంది. పంకా తిరుగుతున్నా ఉక్కవేస్తోంది.

"తీసుకోండి" అన్నాను.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నాం" అన్నాడు.

"అదేం లేదు. చాలా రోజుల తర్వాత భార్యా భర్తలు ఇద్దరూ కలిసి వచ్చారు. ఏమ్మా, మీ ఇంటికి వస్తే నాకు మీరు టీ ఇవ్వరా?" ఆమెను చూస్తూ అన్నాను. సుజాత ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమె జవాబు చెప్పలేదు. నవ్వి ఊరుకుంది. మంచినీళ్లు తాగి కప్పు చేతిలోకి తీసుకున్నాను.

"ఎందుకు ఇవ్వం సార్? మీరు మాలాటి పేదవాళ్ళింటికి ఎందుకు వస్తారు?" అన్నాడు.

"మీరు పిలిస్తే ఎందుకురాను?" అని కూర్చో వెనక్కు జరిగి కూర్చున్నాను.

వాళ్లకేదో సమస్య వచ్చి ఉండాలి. నా దగ్గరకు వచ్చారు. ఏడు గంటలకు నాకు బయటకు వెళ్లే పని ఉంది.

సుజాత కప్పు అందుకుంటోంటే ఆమె ముఖంలోకి చూశాను. ఉన్నపళంగా ఆమెను అతను నా దగ్గరకు తీసుకుని వచ్చినట్టుగా ఉంది. మెడబోసిగా ఉంది. తాళిబొట్టు తాడు కూడా లేదు. రవిక పయి హుక్కు ఊడిపోయి ఉంది. సుజాత హఠాత్తుగా తల ఎత్తే సరికి నా చూపులు ఆమె నుంచి ఎదురుగా ఉన్న గోడ మీదకు సారించాను. మూడు నెలల నుండి కేలండరు మార్చలేదు.

ప్రయివేటుగా లా చేయడం వలన అనుకుంటాను, సమస్యల పరిష్కారం కోసం ఎవరయినా వచ్చినప్పుడు ఏం చేస్తే, ఎలా చేస్తే బావుంటుందో చెబుతుంటాను. చాలా మందిలో నేను గమనించిందేమిటంటే నూటికి తొంబయి మంది నిజాన్ని

నొక్కేస్తుంటారు. మరికొంత మంది తమ నిర్ణయాలకు ఆమోద ముద్ర కోసం వస్తారు. డబ్బుల మాట అటుంచి తర్వాత ఏం జరిగిందో తమంతట తాముగా వచ్చి చెప్పిన వాళ్లు ఎక్కువ మంది ఉండరు. అయినా ఓపికగా సలహాలు ఇస్తుంటాను.

టీ తాగడం ముగించాక, "ఇప్పుడు చెప్పండి" అన్నాను."నేనూ సుజాతకి కలిసి ఉండలేమండీ... విడాకులు తీసుకుందామనుకుంటున్నాను....." అన్నాడు. ఈ మాటలు అంటున్నప్పుడు అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సుజాత ముఖంలోకి చూశాను. ఖాళీ కప్పును బల్ల మీద అటూ ఇటూ తిప్పుతోంది. ఆమె ముఖంలో ఎటువంటి భావం కనిపించడం లేదు.

"ఎందుకు?" అడిగాను.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"ఏమయింది?"

జేబులోంచి రుమాలు తీసి కన్నీళ్లు తుడుచుకుంటూ "నేను దీనితో సంసారం చేయలేనండీ. దీన్ని చూస్తోంటే అసహ్యం వేస్తోంది. నన్నింత క్షోభకు గురి చేస్తుందని అనుకోలేదు" ఉద్వేగంతో అన్నాడు.

దీర్ఘంగా నిట్టూర్చి బల్ల సొరుగులోంచి సిగరెట్ పెట్టె బయటకు తీసి తెరిచాను. అందులో మూడు సిగరెట్లు ఉన్నాయి. ఒకటి తీసి వెలిగించాను. అగ్గిపుల్ల యాష్ట్రేలో పడేసి, "కాపరం చేయడం ఇష్టం లేదనగానే విడాకులు ఇవ్వరు. కారణాలు అడుగుతారు. రుజువులు చూపించమంటారు. పొరపొచ్చలు చాలా కుటుంబాల్లో ఉంటాయి. స్పర్ధలు వచ్చినా పోతుంటాయి. పోట్లాడుకుంటే వారం మాట్లాడుకోరు. రెండు వారాలు మాట్లాడుకోరు. మహా అయితే నెలా, రెండు నెలలు బిగదీసుకుని ఉండి చివరకు ఏకమయిపోతారు" అన్నాను.

"ఇదేం చిన్న విషయం కాదండీ తలుచుకుంటే గుండె మండి పోతోంది"

"చెప్పు, ఏమయింది?"

"ఇందాక నేను డ్యూటీ నుండి ఇంటికి తిరిగి రాగానే సుజాత మంచం మీద ఏడుస్తూ కూర్చుని ఉంది. కారణం ఏమిటని అడిగాను. మా ఆఫీసరు, అదే, పురుషోత్తం గాడు ఆఫీసు నుండి త్వరగా వచ్చి మా ఇంట్లోకి వచ్చి సుజాతను బలవంతం చేయబోయాడు. సుజాత అరుస్తూ ఎదురు తిరిగే సరికి పారిపోయాడు. కోపం

పట్టలేక పోయాను. దొరకుతాడని వాడికోసం వెతికాను. దొరకలేదు. తలుపుకు తాళం వేసుకుని ఎటో వెళ్ళి పోయాడు. దొరికి ఉంటేనా, వాడిని....” ఆగి పళ్లు పటపట కొరికాడు.

“ఎప్పటి నుండి అతని ఇంట్లో ఉంటున్నారు?”

చెప్పాడు.

“మీకు అతను బంధువా?”

“దూరపు బంధువు అవుతాడు. సుజాతకు వరసకూడా కాదు.”

“మిమ్మల్ని ఏ విషయంలోనయినా ఇబ్బంది పెట్టేవాడా?”

“లేదు ఎప్పుడూ పెట్టలేదు”.

“జరిగింది మరెవరికయినా తెలుసా?”

“తెలియదు.”

“అతన్ని పట్టుకొని కొట్టావనుకో. ఇప్పటి వరకు ఎవరికీ తెలియనిది అందరికీ తెలుస్తుంది. నువ్వు కొట్టినందుకు అతనికి దెబ్బలు బాగా తగిలితే అతను ఊరుకోకపోవచ్చు. పోలీసు కేసు పెడతాడు. నీకు తెలియకుండా సుజాతను బయటకు తీసుకు వచ్చినట్టు అవుతుంది. మంచిదా? ఆలోచించు. జరగకూడనిది జరిగి ఉంటే సాక్ష్యాధారాలు దొరికేవి. ఏం జరగనప్పుడు ఏమి దొరుకుతాయి చెప్పు.”

తలాడించాడు. కళ్లల్లో నీళ్లు ఉబుకుతున్నాయి.

“అతను బలవంతం చేయబోయిన విషయం సుజాత చెప్పేవరకు నీకు తెలియదు. చెప్పడం మంచిదయింది. అతను ఎటువంటి వాడో నీకు తెలుసొచ్చింది. కాదా? సుజాత చెప్పిఉండక పోతే నీకు తెలిసి ఉండేదా?”

కన్నీళ్లు తుడుచుకుంటూ “లేదు” అన్నాడు.

“సుజాతను కొట్టావా?”

“కొట్టాను.”

“ఆమెను కొట్టవలసిన అవసరం ఏమిటి? నీతో జరిగింది చెప్పినందుకా? అందుకు అది ఆమె తప్పు అయినట్టు కాపరం చేయను. విడాకులు తీసుకుంటాను అనడం ఏం బావుండలేదు. నువ్వు మంచి వాడివి. నాకు తెలుసు. నువ్విలా మాట్లాడుతోంటే నాకు ఆశ్చర్యం వేస్తోంది. తొందర పడకు. ఒక్క మాట చెప్పు

సుజాత ముందే అడుగుతున్నాను. సుజాత మీద నీకు అనుమానం ఉందా?"

తల అడ్డంగా ఆడించి, "లేదు". అన్నాడు. అతని ముఖంలో ఇందాకటి టెన్షన్ లేదు.

"నిజంగా?"

"నిజంగా. మా అబ్బాయి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. లేనేలేదు".

"తొందరపడ్డావు".

"అవును".

"ఒక పని చేయి. పురుషోత్తం వారం పదిరోజుల పాటు మీకు కనిపించకపోవచ్చు. ఆఫీసుక్కూడా సెలవు పెట్టొచ్చు. వీలయినంత త్వరగా అతని క్వార్టర్ ఖాళీ చేసి వేరే ఎక్కడన్నా ఇల్లు తీసుకోండి.... మీ ఇద్దరూ అయిదు నిమిషాల పాటు ఇక్కడే కూర్చుని మాట్లాడుకుంటూ ఉండండి. నేను సెంటరు వరకు వెళ్ళి సిగరెట్లు తెచ్చుకుంటాను..." అని కుర్చీలోంచి లేవ బోయాను.

అతను చటుక్కున లేచి, "నేను తీసుకు వస్తాను. ఏ బ్రాండు?" అడిగాడు.

పేకేట్ చూపించి అతను వద్దంటున్నా యాభై రూపాయల నోటిచ్చి, "పేకేట్ పట్రా" అన్నాను.

నా బల్ల మీదున్న పేకట్‌లో మరో రెండు సిగరెట్లు ఉన్నాయి. నాకు కావలసింది సిగరెట్లు కాదు. సుజాతతో మాట్లాడడానికి సమయం. అతను ఉంటే సుజాతతో మాట్లాడవలసినవి మాట్లాడలేను. లేచి లయిటు వెలిగించి వచ్చి కుర్చీలో కూర్చుంటోంటే సుజాత ముందుకు వంగింది. ఆమె స్తనాలు బల్లకు వత్తుకుపోతున్నాయి. పచ్చటి శరీరం ఆమెది. "మా ఆయన మళ్ళీ నా మీద చేయి చేసుకోడు కదండీ?" అడిగింది.

"ఊహూ. చేసుకోడు. పురుషోత్తం మీద వచ్చిన కోపాన్ని నీ మీద చూపించాడు. అంతే."

సుజాత ముఖంలో నవ్వు కదిలింది.

"ఒక్క మాట అడుగుతాను. నిజం చెప్పాలి" అన్నాను.

"అడగండి."

"ఏమనుకోకూడదు".

"అనుకోను."

“పురుషోత్తం నిన్ను బలవంతం చేయబోయాడా, చేశాడా?”

తల వంచుకుని కొద్దిసేపు మవునంగా ఉండి, “చేశాడు” అని తలెత్తి, “ఈ సంగతి ఆయనకు చెప్పొద్దు” అంది. ఆ మాటలో నాకు ఏ మాత్రం భయం కనిపించలేదు.

“నన్ను నమ్ము. చెప్పను. ఈ మాట నువ్వు నాతో అనలేదు. నేను వినలేదు. సరేనా? ఇంకో సంగతి చెప్పు. పురుషోత్తం నిన్ను ఎప్పటినుండి బలవంతం చేస్తున్నాడు?”

“దాదాపు రెండు సంవత్సరాల నుండి” పెదాలు జారిన నవ్వు బయటకు రాకుండా నా కళ్లల్లోకి చూస్తూ అంది.

“మరి రెండు సంవత్సరాల నుండి జరుగుతోంటే మీ ఆయనకు ఎందుకు చెప్పలేదు?” నా స్వరం నాకే కొత్తగా ధ్వనించింది.

“ఎప్పటికప్పుడు చెబుదామనుకుంటూనే మర్చిపోతున్నాను” నిబ్బరంగా అంది.

❖ ఆదివారం వార్త, 1 మార్చి, 2009